క్లుప్తంగా

కళాశాల అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి పాఠశాల పూర్వ విద్యార్థి బెజవాడ శ్రీనివాసరావు దంపతులు రూ.లక్ష విరాళాన్ని ప్రిన్సిపాల్ టి.చక్రపాణికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అటుపోట్లను ఎదుర్కొని ముందుకు సాగితే ఉన్నత లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. బెజవాడ శ్రీనివాసరావు దంపతులను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు చిడిపోతు వెంకటేశ్వర్లు, ఉన్నం వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్‌కళ్యాణ్

పామూరు: ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో జరుగుతాయని ఆ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వాలను నమోదు చేయించారు. విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పోతల ప్రభాకర్, తాహిద్, శశిధర్, సిద్ధు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ సోమశేఖర్

కొండపి: కొండపి సర్కిల్ పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సోమశేఖర్ హెచ్చరించారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అవసరమైతే రౌడీషీట్ సైతం ఓపెన్ చేస్తామన్నారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీకి మాత్రమే విక్రయాలు చేయాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


అపరాల పంటలు సాగు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ నిర్మలాకుమారి

పొన్నలూరు: ఆహార భద్రత, ప్రస్తుత మార్కెట్ విధానాన్ని బట్టి రైతులు అపరాల పంటలను సాగుచేయాలని సింగరాయకొండ సహాయ వ్యవసాయ సంచాలకురాలు నిర్మలాకుమారి అన్నారు. మండలంలోని పెదవెంకన్నపాలెం, మాలపాడు గ్రామాల్లో శనివారం పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు పంటకు బదులుగా శనగ, మినుము వంటి అపరాల పంటలను సాగు చేయాలన్నారు. అన్ని పంటలలో విత్తన శుద్ధి, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందాలన్నారు. అలాగే భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు సాగు చేసి వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణచంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు రూ. 39 లక్షలు మంజూరు



మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ డీఈ ఆనందరావు

మర్రిపూడి: మండలంలో చిలంకూరు నుంచి ఉప్పలపాడు బ్రిడ్జి వరకు ఉన్న గుంతల రహదారిని మరమ్మతులకు రూ. 39లక్షలు నిధులు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ డీఈ ఆనందరావు తెలిపారు. మండలంలోని చిలంకూరు గ్రామ శివారులో శనివారం గుంతల రహదారి మరమ్మతు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని చిలంకూరు గ్రామం నుంచి ఏలూరు, సాలూరు, మల్లారెడ్డిపాలెం మీదుగా ఉప్పలపాడు వరకు రహదారి మరమ్మతులు పనులు ప్రారంభించామన్నారు. 14–8 నుండి 26–4 వరకు 11.5 కిలోమీటర్ల మేర రూ. 39 లక్షల ఆర్‌అండ్‌బీ నిధులతో ఈ రహదారి మరమ్మతులు చేపడతామన్నారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ ఏఈ దీప్తీ, రామయ్య, రాంబాబులు ఉన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు అగచాట్లు

- ఆధార్ కేంద్రాల వద్ద క్యూలు కడుతున్న విద్యార్థులు
- అపార్ ఐడీకి, జేఈఈ మెయిన్స్‌కు ఆధార్ అప్‌డేట్ అవసరం
- పాఠశాలలు, కళాశాలల వదిలి ఆధార్ కేంద్రాలకు వస్తున్న విద్యార్థులు
- ఒకటి రెండు సెంటర్లకే అనుమతులు
- ఇచ్చిన సెంటర్లలో కూడా పరికరాలు లేక సేవలు నిలుపుదల
- పట్టించుకోని అధికారులు



పామూరు రోడ్డులోని యూనియన్ బ్యాంక్‌లో ఆధార్ కేంద్రం వద్ద విద్యార్థులు

కందుకూరు రూరల్:

ఆధార్ అప్‌డేట్‌కు విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం నూతనంగా అపార్ అనేక ఒక ఐడీని విద్యార్థికి క్రియేట్ చేస్తున్నారు. నర్సరీ నుంచి పీహెచ్‌డీ చదువుకునే విద్యార్థులందరికీ ఒక అపార్ ఐడీ వస్తుంది. ఈ అపార్ ఐడీలో విద్యార్థి వివరాలన్నీ నమోదై ఉంటాయి. ఈ ఐడీ క్రియేట్ చేయాలంటే కచ్చితంగా సర్టిఫికెట్లలో ఎలా ఉందో ఆధార్ కార్డులో కూడా అలాగే వివరాలు ఉండాలి. పుట్టిన తేదీ, పేరు, తల్లిదండ్రుల పేర్లు, అడ్రస్ వివరాలు అన్ని సక్రమంగా ఉండాలి. అలా ఉంటేనే ఐడీ వస్తుంది. సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులలో పుట్టినతేదీ, ఇంటి పేరు, పేరు, తల్లిదండ్రుల పేర్లలో తేడాలు ఉంటే ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి. అన్ని సక్రమంగా ఉంటేనే అపార్‌లో వివరాలు నమోదుకు స్వీకరిస్తుంది. సరిపోలకపోతే తీసుకోవడం లేదు. దీంతో ఆధార్ అప్‌డేట్ చేయించుకునేందుకు విద్యార్థులు ఆధార్ కేంద్రాల వద్ద క్యూలు కడుతున్నారు.

పనిచేయని ఆధార్ కేంద్రాలు

కందుకూరు పట్టణంలో ప్రైవేట్‌గా పామూరు రోడ్డులోని యూనియన్ బ్యాంక్, కోవూరు రోడ్డులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌ల వద్ద కేంద్రాలు ఉన్నాయి. అదే విధంగా 12, 13, 7వ సచివాలయాలకు ఆధార్ కేంద్రాలను ఇచ్చారు. అయితే వీటిల్లో 12వ సచివాలయం మాత్రమే పని చేస్తుంది. మిగిలిన 13, 7వ సచివాలయాల్లో పరికరాలు మరమ్మతులకు గురి కావడంతో సేవలు నిలిపివేశారు. కందుకూరు మండల పరిధిలో మోపాడు, పలుకూరు గ్రామాల్లోని సచివాలయాకు కేంద్రాలు ఇవ్వకుండా మోపాడు సచివాలయంలో ఓ డివైజ్ మరమ్మతులకు గురి కావడంతో అది కూడా నిలిచిపోయింది. ఉన్న ఈ మూడు కేంద్రాల వద్ద విద్యార్థులు క్యూలు కడుతున్నారు. ఒక్కో ఆధార్ కార్డు అప్‌డేట్ చేయాలంటే 30 నుంచి 45 నిమిషాల వరకు సమయం పడుతుంది. దీంతో కేంద్రాల వద్ద ముందుగా కొందరు టోకెట్లు ఇస్తుండగా మరి కొందరు క్యూల్లో నిలబెడుతున్నారు. గంటల తరబడి క్యూల్లో నిలబడలేక విద్యార్థులు అల్లాడుతున్నారు. సచివాలయాలు అన్నింటిలో కంప్యూటర్లు డివైజ్‌లు ఉన్నాయి. కావాల్సిన మరి కొన్ని డివైజులు ఇచ్చి ఆధార్ అప్‌డేట్‌కు అవకాశం ఇస్తే ఏ సచివాలయ పరిధిలోని వారు అక్కడే అప్‌డేట్ చేయించుకుంటే అవకాశం ఉంటుంది. కానీ అధికారులు మాత్రం దీనిపై దృష్టి సారించడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అప్‌డేట్‌లో కూడా అనేక సమస్యలు...

ఆధార్ కార్డు నూతనంగా తీసుకోవాలంటే పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఉంటే సరిపోతుంది. అయితే గతంలో పుట్టిన తేదీ సర్టిఫికెట్లు లేని వారు పదో తరగతి సర్టిఫికెట్‌లో ఉన్న పుట్టిన తేదీ ప్రకారం ఆధార్‌లో నమోదు చేయించుకునేవారు. పదో తరగతి సర్టిఫికెట్ ఆధారంగా ఆధార్ కార్డులో తేడాలు ఉంటే మార్చుకునేవారు. కానీ ప్రస్తుతం 18 సంవత్సరాలు పైబడిన వారికే పదో తరగతి సర్టిఫికెట్ ఆధారంగా ఆధార్ కార్డులో మార్పులు చేయించుకునే అవకాశం ఇచ్చారు. 18 ఏళ్ల లోపు ఉన్న వారికి కచ్చితంగా పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఉంటేనే ఆధార్‌లో పుట్టిన తేదీ మార్పు చేసే అవకాశం ఇచ్చారు. దీంతో ఎక్కువ శాతం 6 నుంచి ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులు పుట్టిన తేదీ మార్పుకు పుట్టిన తేదీ సర్టిఫికెట్ కావాలని ఆధార్ కేంద్రాల వారు చెప్తున్నారు. దీంతో పుట్టిన తేదీ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు తిరుగుతున్నారు. వీటిల్లో కూడా కొంత మందికి ప్రైవేటు వైద్యశాలల్లో కాన్పులు జరిగితే వారు ఆయా మున్సిపాలిటీ, పంచాయతీలకు రికార్డులు పంపించకపోవడంతో వారు ఆన్‌లైన్‌లో పుట్టిన తేదీ వివరాలు నమోదు కావడం లేదు. దీంతో వారు లేట్ ఎంట్రీ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం, ఆధార్ అప్‌డేట్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో పాటు త్వరలో జేఈఈ మెయిన్ పరీక్ష ఉండడంతో కేవైసీ అప్‌డేట్‌కు కూడా విద్యార్థులు ఆధార్ కేంద్రాలకు వస్తున్నారు.

వదులుకో..లేకుంటే వేధింపులే..!

- రేషన్ దుకాణాన్ని వదులుకోవాలని డీలర్‌కు వేధింపులు
- నెల రోజుల్లో రెండు సార్లు తనిఖీ
- తనిఖీల్లో తేడాలు లేకున్నా ఎన్‌ఫోర్సుమెంట్ అధికారుల బెదిరింపులు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలకు అధికారులు దాసోహమైపోయారు. నేతలు ఏది చెబితే అది చేస్తూ నిబంధనలను గాలికొదిలేసి వేధింపులకు గురి చేస్తున్నారు. ముఖ్యంగా రేషన్ డీలర్లపై ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులను బూచిగా చూయించి భయపెడుతున్నారు. 15 రోజులకు ఒకసారి తనిఖీలు చేస్తూ డీలర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తనిఖీల్లో ఏం దొరక్కపోయినా డీలర్లను బెదిరించి దుకాణాన్ని వదులుకోవాలని బెదిరించడం పట్ల సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళితే..మండలంలోనిఐ వల్లూరులో సనగర శ్రీనివాసరావు గత 20 ఏళ్లుగా రేషన్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆ దుకాణంపై గతంలో ఒక్క ఫిర్యాదు కూడా లేదు. కానీ అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల మేరకు ఆ దుకాణాన్ని ఎలాగైనా డీలర్‌ను మార్చాలన్న ఉద్దేశంతో నెల రోజుల్లో రెండుసార్లు తనిఖీ చేశారు. ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు గత నెల 8న తనిఖీలు చేశారు. తనిఖీల్లో కంది పప్పు, చక్కెర, బియ్యం ఇందులో వేటిలో కూడా వ్యత్యాసం కనిపించలేదు. తిరిగి శనివారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లోనూ ఎటువంటి తేడాలు గుర్తించలేదు. అయినా ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు డీలర్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము తనిఖీలు చేస్తున్నామని పైకి చెబుతున్నా..అధికార పార్టీలు ఒత్తిళ్లతోనే దాడులు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత నెల 16న డీలర్ శ్రీనివాసరావు నామినీగా ఉన్న తన తమ్ముడు కోటేశ్వరరావును తొలగించి, తన భార్య శ్రీదేవిని చేర్చాలని తహసీల్దార్ ఆంజనేయులకు వినతిపత్రం అందించారు. అయితే కోటేశ్వరరావును నామినీగా తొలగించిన అధికారులు శ్రీదేవిని మాత్రం నామినీగా చేర్చలేదు.

ప్రజాపోరును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

సీఎస్‌పురం(పామూరు): ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు చేపట్టే ప్రజాపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సీపీఎం మండల పార్టీ సమావేశం తిరుపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి హనీఫ్ మాట్లాడుతూ గత నెల రోజులుగా నూనెల ధరలు, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ధరలను అదుపుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఉద్యోగావకాశాలు లేకపోవడంతో నిరుద్యోగ యువత నానాటికీ అధిగమవుతూ దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో నిత్యం దళితులపై దాడులు, బాలికలు, మహిళలపై లైంగిక దాడులు నానాటికీ ఎక్కువవుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు వీటిని పూర్తిగా అరికడతామని చెప్పినా ఆచరణలో వారి హామీల అమలు శూన్యమన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రభుత్వం మరోసారి పేదలపై రు.20 వేల కోట్ల విద్యుత్‌చార్జీల భారాన్ని మోపేందుకు సిద్ధమవుతోందని దీనిని ఉపసంహరించుకోవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలుచేయాలని, విశాఖఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, జమిలీ ఎన్నికలు ఆపాలని కోరుతూ ఈనెల 15వ తేదీన జిల్లా కలెక్టరేట్, మండల తహసీల్దార్ కార్యాలయాలవద్ద చేపట్టే ధర్నాలను జయప్రదం చేయాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు, నాయకులు ఎం.రత్నారెడ్డి, బి.జేసురత్నం, జి.ఏసుదాసు, ఊసా రాజ్యలక్ష్మి, పామూరు మండల సీపీఎం కార్యదర్శి కే.మాల్యాద్రి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు



తిరగలదిన్నెలో అభిషేకంలో పరమేశ్వర మూలవిరాట్




పామూరులో విశిష్ట అలంకరణలో సహస్ర లింగేశ్వరస్వామి



భైరవకోనంలో త్రిముఖదుర్గాదేవి మూల విగ్రహమూర్తి

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనతో పాటు సీఎస్‌పురం పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయం, రాజుపాలెం రామలింగేశ్వర ఆలయంలో కార్తీక మాస వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భైరవకోనలో త్రిముఖ దుర్గాదేవి, కాలభైరవ, నగరేశ్వర, భర్గులేశ్వర ఆలయాల్లో అలయ అర్చకులు అభిషేకాలు, విశిష్ట పూజలు చేశారు. ఏకరుద్రం, గణపతి హోమం నిర్వహించారు. ఈఓ వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పామూరు: మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కార్తీకశోభను సంతరించుకున్నాయి. స్థానిక వల్లీసమేత భుజంగేశ్వరస్వామి ఆలయం, అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశజ్యోతిర్లింగాల ఆలయం, బొట్లగూడూరులోని కామాక్షీసమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, దాదిరెడ్డిపల్లెలోని పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం, పడమటి కట్టకిందపల్లెలోని శ్యామలా కామాక్షి సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, మోపాడు పంచాయతీ పరిధిలోని గొందిమల్లేశ్వర స్వామి ఆలయాలతో పాటు మండలంలోని అనుమునిగిరి శివరామ బ్రహ్మక్షేత్రంలలో అర్చకులు విశిష్ట పూజలు చేశారు. స్థానిక వల్లీసమేత భుజంగేశ్వర ఆలయంలో అర్చకులు మహంకాళి శివప్రసాద్ స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు పాల్గొన్నారు.



భైరవకోనలో జలపాతం వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

చెట్లను నరికేస్తున్నారు..!



నరికిన వేపచెట్లను ట్రాక్టర్‌లో తీసుకుని వెళుతున్న దృశ్యం

సింగరాయకొండ: పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలి, చెట్లను పెంచాలని ఊకదంపుడు ఉపన్యాసాలను నేతలు,అధికారులు చేస్తుంటారు. కానీ వాస్తవంలో మాత్రం అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో కూరగాయల మార్కెట్ సెంటర్‌లో, కందుకూరు రోడ్డు సెంటర్‌లో భారీ వేపచెట్లను కూల్చారు. వాస్తవానికి చెట్లను నరకాలంటే ఫారెస్టు అధికారుల అనుమతి అవసరం. అంతేకాక అనుమతి లేకుండా చెట్లను నరికితే బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. కానీ ఇక్కడ మాత్రం అటువంటిదేమి ఉండదు. లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి రోడ్డు పక్కన స్థలాలు కొంటారు. ఆ స్థలాలకు అడ్డం వస్తున్నాయని ఏళ్ల నాటి చెట్లను నరికేయటం పరిపాటిగా మారింది. ఇటీవల వర్షం నీరు మెయిన్‌రోడ్డులో నిలబడటంతో రోడ్లు పాడవుతున్నాయని, నీరు రోడ్లపై నిలబడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి స్వామి అధికారులను ఆదేశించారు. దీన్ని ఆసరాగా తీసుకుని కొంతమంది వ్యాపారులు తమ షాపుల ముందు ఉన్న చెట్లను తొలగించుకున్నారు. మరోపక్క ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉందని పోలీసులు రోడ్డు పైకి వచ్చిన చెట్ల కొమ్మలు నరికించారు. మరోపక్క విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయని కొమ్మలు నరికేస్తున్నారు. శుక్రవారం చెట్లను నరికారన్న సమాచారంతో ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు అందుకు బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవటానికి గ్రామానికి వచ్చారు. కానీ ఏమైందో కేసు నమోదు కాలేదు.

కార్మికులకు శానిటరీ వస్తువుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు 18 మందికి రూ.90 వేల విలువైన శానిటరీ దుస్తులు, మెటీరియల్ పంపిణీ చేశారు. సర్పంచ్ శివరామిరెడ్డి మాట్లాడుతూ పంచాయతీలో పారిశుధ్యంతో పాటు పారిశుధ్య కార్మికులపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. ఈఓ రామారావు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎంకు కంప్యూటర్ అందజేస్తున్న దృశ్యం

సీఎస్‌పురం(పామూరు): జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు దాతలు కంప్యూటర్ అందజేయడం కొనియాడదగినదని పాఠశాల హెచ్ఎం అరియారం సురేష్ అన్నారు. మండలంలోని పెదరాజుపాలెం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు అదే గ్రామానికి చెంది బెంగుళూరులో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రుద్రరాజు మహేష్‌రాజు రు.40 వేల విలువైన కంప్యూటర్‌ను పాఠశాలకు సమకూర్చారు. స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గుంటి మడుగు లక్ష్మీనారాయణ కంప్యూటర్‌ను జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అరియారం సురేష్‌కు అందజేశారు.

నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు



వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్, కౌన్సిలర్లు

కనిగిరి రూరల్: పట్టణంలోని నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని 16,17వ వార్డుల్లో శనివారం చైర్మన్ గఫార్, కౌన్సిలర్ దేవకి రాజీవ్, పులిశ్రీను విజయలక్ష్మీలతో కలిసి పర్యటించారు. స్థానికులు, నీటి సమస్య, పారిశుధ్యం, విద్యుత్ దీపాల సమస్యను చైర్మన్‌కు వివరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ నీళ్ల సంవృద్ధిగా పడే ప్రాంతాల్లో డీప్ బోర్ వెల్స్ వేయించి, పైప్‌లైన్ ద్వార నీటిని అందించి ప్రజలకు నీటి సమస్యను శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. ఏఈ కోటేశ్వరరావు, కౌన్సిలర్లు పులిశ్రీను విజయలక్ష్మి, దేవకి రాజీవ్, సచివాలయ కార్యదర్శులు తేజస్వినీ, లావణ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ



ఆలకూరపడులో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

టంగుటూరు: రోటరీ క్లబ్ సిగరాయకొండ ఆధ్వర్యంలో ఆలకూరపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలకు శనివారం ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ తన్నీరు బాలాజీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రోటరీ క్లబ్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న సేవలను కొనియాడారు. బాలికలను ప్రోత్సహించేందుకు సైకిళ్ల పంపిణీ అభినందనీయమని, విద్యార్థినులకు చదువుతో పాటు నూతన వస్తువులు ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోధ్యాయుడు వెంకటరెడ్డి, రోటరీ క్లబ్ కోశాధికారి నాగసూరి వెంకట సుబ్బారావు, డీకేడీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు పంట మార్పిడి చేయాలి

టంగుటూరు: రైతులు పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధిస్తారని వ్యవసాయాధికారి స్వర్ణలత అన్నారు. మండలంలోని ఎం నిడమాలూరు, పొందూరు, మర్లపాడు గ్రామాల్లో పంట మార్పిడిపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా మినుము, శనగ పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులు ఏటా ఒకే పంట సాగు చేయడంవల్ల భూమి సారం తగ్గుతుందని, తెగుళ్లు, పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజ మాట్లాడుతూ రైతులు మేలైన రకం ఎంపిక, విత్తనశుద్ధి, సమగ్ర ఎరువుల యజమాన్య పద్ధతులు, సస్యరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు కె.సుభాషిణి, వేణుముని, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.